# మా మాట

**పాఠకులకు, ప్రకటన కర్తలకూ గురుపూర్ణిమ శుభాకాంక్షలు.**

ఒక గురుపూర్ణిమ నాడు బాబా మసీదులో కూర్చొని ఉన్న భక్తులతో "అట్లా కాలక్షేపం కబుర్లతో కాలం వెలిబుచ్చుటమెందుకు పూజాద్రవ్యాలు తెచ్చి మశీదులోని స్తంభానికి పూజ చేయమని" చెప్పేరు. బాబా మాటలోని భావం, ఆరోజు ప్రాముఖ్యతను తెలుసుకున్న శ్యామా, నూల్కర్ మొదలైన భక్తులు స్తంభాన్ని ఎందుకు పూజచేస్తాము నీకే చేస్తామని పట్టుబట్టటం వలన, చివరకు బాబా అంగీకరించక తప్పలేదు. అప్పటినుంచి ప్రతి గురుపూర్ణిమరోజు ఉత్సవం చేయటం ప్రారంభించారు. ఇంటి కప్పుకు స్తంభము ఎలా ఆధారభూతమై నిలుస్తుందో అట్లానే సృష్టికంతకు ఆధారభూతమైన శక్తిని గమనించి, ఆరాధించమని సాయి మాటల్లోని భావం. ఆరాధించటం అంటే కేవలము యాంత్రికముగా, పూజ పునస్కారాలతో పొద్దుపుచ్చక, అవతలి వారికి ఇష్టమైన రీతిలో జీవించటం. తాత్కాలికమైన సుఖసంతోషాలు కలిగించే వ్యక్తి పట్ల వ్యక్తంచేసే ఆరాధనలోని తీవ్రతను, భగవంతుడిపట్ల చూపము. మనము తీవ్రంగా ఆరాధించేవ్యక్తి, తన ప్రేమను అంగీకరించకపోయినా, మాట్లాడక పోయినా, ప్రాణత్యాగం చేయటానికైనా సంసిద్ధ పడతాము కాని, శాశ్వతమైన సుఖసంతోషాలు ప్రసాదించే భగవంతుడి ప్రేమ కోసం కొద్దిపాటి శ్రమను కూడ ఓర్చము. కారణం సద్గురువుపట్ల నిజమైన ప్రేమ లేకపోవటం. మరి సద్గురువును ఆరాధిస్తున్నామన్నమాట నిజమేనా? మనస్ఫూర్తిగా ఆరాధించలేకపోవటానికి కారణం? తాత్కాలికమైన లౌకిక సుఖాలపట్ల ఆపేక్ష, అసలైన దానిపైలేకపోవటం. సుఖాలనుకొని కూడగట్టుకున్న సంపద దు:ఖానికి కారణం కాగానే, మరల అవకాశాన్ని అవసరాన్నిబట్టి ఎక్కడెక్కడికో పరుగు. ఎక్కడికి పరిగెత్తి, ఎవరిని వేడుకున్నా, సృష్టి అంతా ఆవరించిన, చైతన్య స్వరూపుడయిన జగద్గురువు, దానికి మూల స్తంభమై నిలుస్తున్నాడని గుర్తెరిగి ప్రవర్తించమని బాబా బోధ. సాలె పురుగు ఇతరములనుండి రక్షణకోసం తనచుట్టూ గూడు అల్లుకొని, దానిలో చిక్కుకొనిబడిపోయిన చందాన, సుఖము, సంతోషము, పొందాలని, వాటికోసం వస్తు సముదాయము, సంపదలు మొదలైనవి కూడగట్టుకొని వాటిలో చిక్కుకొనిబడిపోయి, గురువును గుర్తించకపోవటం జరుగుతున్నది. దానికి కారణం కేవలం 'మన యిష్టాలనే' నెరవేర్చుకోవటానికి గురువు దగ్గరకు చేరటం వలన, అందువలన ప్రేమ స్వరూపుడయిన సద్గురువు అవాజ్యమైన ప్రేమను మనము గుర్తించలేక, మనము ఆయనపై పిసరంతైన ప్రేమను కూడ కనబర్చలేకపోతున్నాము, అందుకు అవరోధమైన వాటిని గుర్తించి తొలిగించుకోమని, కనీసం ఒక్క అడుగైనా సద్గురువువైపు వేస్తే, పదడుగులు ఆయన వెంటనుండి నడిపిస్తూ గమ్యం చేరుస్తాడని ప్రబోధిస్తున్నాయి గురుపూర్ణిమ, కృష్ణాష్టమి, వినాయకచవితి పర్వదినాలు.

మీ ఆదరాభిమానాలతో పదవ సంవత్సరములోకి అడుగిడిన సద్గురువాణి **"జన్మదిన సంచిక"** (జనవరి, ఫిబ్రవరి, మార్చి 2010)ను మాత్రమే ప్రత్యేక సంచికగా రూపొందించి అందించాలని భావించి, మీకందించాము. కాని గత సంచిక, ఈ సంచిక కూడ ప్రత్యేక సంచికగా మీకందించగలుగుతున్నామంటే కేవలం 'సాయిమాస్టర్ కృపానుగ్రహము', మీ ఆదరాభిమానలవల్లనే సాధ్యమయ్యింది. ఈ దశాబ్ధములో చివరి సంచిక (అక్టోబరు, నవంబరు, డిసెంబరు 2010) కూడ ప్రత్యేక సంచికగా ముందుకు తీసుకురాగలమని సవినయముగా తెలియజేసుకుంటున్నాము. 2001వ సంవత్సరములో కేవలము నామమాత్రపు రుసుముతో, సేవా దృక్పధముతో అందరికీ సాయిని అందించాలనే ఉద్దేశ్యముతో, ప్రారంభించబడినది **'శ్రీ భరద్వాజ సద్గురువాణి'**. అన్ని రంగాలలో అనూహ్యమైన మార్పులొచ్చి, వాటికి చెల్లించే మూల్యములు ఎన్నో రెట్లు పెరిగినా, రాశిలోను, వాశిలోను రాజీలేని విధముగా **'శ్రీ భరద్వాజ సద్గురువాణి'** మీకందించగలుగుతూ, శిరిడీసాయి సేవాట్రస్టుతో పాటు సంయుక్తముగా సేవా కార్యక్రమములు చేయగలుగుతున్నాము అంటే దానికి మీ అందరి హృదయపూర్వక చేయూత, ఆదరాభిమానాలే కారణం. సాయిమాస్టర్ అనుగ్రహము, అనుజ్ఞ అయితే నూతన దశాబ్దములో స్వల్పముగా మూల్యము పెంచాలని మాయోచన. **'శ్రీ భరద్వాజ సద్గురువాణి'** మీ హృదయవాణిగా తీర్చిదిద్దే మా ప్రయత్నానికి, మీ సహాయ సహకారములు నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ...



**స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలతో**

**మీ పబ్లిషర్**